న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్శిటీ చైర్మన్ జోసఫ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న రాజమౌళి

జబర్దస్త్ రాజమౌళికి డాక్టరేట్

మహబూబాబాద్ రూరల్ : జంగిలికొండ గ్రామానికి చెందిన జబర్దస్త్ ఫేమ్ రాజమౌళికి మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సమావేశంలో న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్శిటీ చైర్మన్ డాక్టర్ జోసఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ డాక్టరేట్‌ను అందజేశారు. రాజమౌళిని జిల్లా వాసులు అభినందించారు.

ఎమ్మెల్యేకు వివరాలు తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదు

బయ్యారం, జనవరి 28 : డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని బాలాజీపేటకు చెందిన డ్వాక్రా మహిళలు ఇల్లందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి విన్నవించుకున్నారు. మహిళా సంఘాలకు సంబంధించి స్త్రీనిధి నిధులు, రుణాల మంజూరుతో పాటు ధాన్యం కొనుగోళ్ల విషయంలో లక్షల రూపాయల అవినీతి జరగడంతో 15 గ్రూపుల మహిళలు డీఆర్‌డీఏ పీడీ, పోలీసులకు నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. గ్రామానికి వచ్చి విచారణ చేపట్టి వివరాలు సేకరించిన అధికారులు ఇంత రకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన సొత్తును రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని మహిళలు ఎమ్మెల్యేను వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే డీఆర్‌డీఏ పీడీకి ఫోన్ చేసి వారం రోజుల్లోగా మహిళల డబ్బులను రికవరీ చేయాలని తెలిపినట్లు డ్వాక్రా సంఘాల సభ్యులు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న గూడూరు సీఐ సూర్యప్రకాశ్

దుప్పట్ల పంపిణీ

కొత్తగూడ, జనవరి 28 : కొత్తగూడ మండలంలోని కార్లాయి గ్రామంలో మంత్రి సీతక్క ఆదేశాలు, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సూచన మేరకు వృద్ధులకు గూడూరు సీఐ సూర్యప్రకాశ్ మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కుశకుమార్, కొత్తగూడ కాంగ్రెస్ నాయకులు చల్లా నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, సుంకరబోయిన మొగిళి, కొత్తగూడ బ్లాక్ అధ్యక్షుడు లావణ్యావెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

చిన్నగూడూరు, జనవరి 28 : గురుకులాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. టెన్త్ విద్యార్థులకు రోజువారీ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ , ప్రత్యేక తరగతులు కొనసాగిస్తూ, వందకు వందశాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చిన్నగూడూరు: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

కురవి, జనవరి 28 : విద్యార్థులు కష్టపడి చదువుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. మండలంలోని నేరడ గ్రామ జడ్పీహైస్కూల్, కేజీబీవీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు వంటగది, ఆహార పదార్థాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కోర్సుల గురించి గైడెన్స్ ఉపాధ్యాయులు అందించాలన్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో అమలు చేస్తున్న మెనూను కచ్చితంగా పాటించాలన్నారు. కస్తూర్బా బాలిక వసతి గృహం పరిసరాలను పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ దయ్యాల సరస్వతి, నేరడ హైస్కూల్ ఇన్‌చార్జ్జి హెచ్‌ఎం సాయిలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : రోడ్డుభద్రతా నియమాలను పాటించడం అందరి బాధ్యత అని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాలను మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయన్నారు. బాధితుల్లో 60శాతం నుంచి 70శా తం వరకు యువతే ఉన్నారని, నియమాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాను యాక్సిడెంట్ ఫ్రీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

మానుకోట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా పోలీసులు

తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు భద్రతపై పోలీసుల ర్యాలీ

తొర్రూరు : జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా తొర్రూరు డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాలకేంద్రం వరకు కొనసాగింది. ర్యాలీలో స్థానిక యువత, ప్రజలు, పోలీసులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్పీ కృష్ణకిశోర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ గణేశ్, ఎస్సైలు ఉపేందర్, రాజు, రాంజీ నాయక్, కానిస్టేబుల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూపీఎస్ గెజిట్ పత్రాలను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

పాత విధానం అమలు చేయాలి

బయ్యారం, జనవరి 28 : పాత పింఛన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయకపోవడం సిగ్గు చేటని టీఎస్ సీపీఎస్సీ సంఘం నాయకులు రవీందర్, దస్తగిరి అన్నారు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బయ్యారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన యూపీఎస్‌కు సంబంధించిన గెజిట్ పత్రాలను దహనం చేసి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమం, కుటుంబ సామాజిక భద్రత ఆలోచించకుండా కేవలం షేర్ మార్కెట్ ద్వారానే ఉద్యోగి భవితవ్యాన్ని నిర్ణయించే విధంగా ఉన్న యూపీఎస్ విధానం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షం, రామేశ్వరరావు, లక్ష్మీనారాయణ,వీ శ్రీనివాస్,బీ.సుధాకర్ కొలిపాక శ్రీనివాస్,లక్ష్మయ్య,అరుణ శోభకుమారి,విజయ పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ పోయినవి
అజ్మీర కళ్యాణి,భర్త: పెద్దన్నకుమార్, R/o ఇ.నెం. 3-285/6/5B, అమరావతినగర్, హన్మకొండ. డాక్యుమెంట్స్ నెం. 7899/2015 గలవి ఖమ్మం నుండి మోదుగడ్డ తండాకు బైక్‌పై వస్తున్న క్రమంలో పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు సంప్రదించగలరు.
సెల్: 7893283005

CHANGE OF NAME
I, SUKANYA (Old Name) W/o: ARSHANAPALLY SREEDHAR RAO, CHANGED MY NAME AS ARSHANAPALLY SUKANYA (New Name) W/o: ARSHANAPALLY SREEDHAR RAO, R/o: HANAMKONDA -506001, TGS, INDIA.
NTW-7709

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సీరోలు మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా గోపన్న

కురవి అధ్యక్షుడిగా ఐలి వీరేందర్

కురవి(సీరోలు), జనవరి 28: జాతీయ బీసీ సంఘం సీరోలు మండల అధ్యక్షుడిగా సీరోలు గ్రామానికి చెందిన మక్క గోపన్నను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కసనబోయిన మల్లయ్య, యూత్ అధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా బోయిన రంజిత్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పేర్ల గణేశ్, సీరోలు మాజీ ఎంపీటీసీ మక్కల వెంకన్న, పత్తి సహదేవ, శ్యామల రాజు, బట్టు శ్రీను, శ్యామల ముత్తయ్య, భూపతి నాగయ్య పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం కురవి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఐలి వీరేందర్, గుంటుక యాదగిరిలను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు.

డోర్నకల్ మండల అధ్యక్షుడిగా బాబు

డోర్నకల్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం డోర్నకల్ మండల అధ్యక్షుడిగా కాడెం బాబు, ప్ర ధాన కార్యదర్శిగా కాసం వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు వెంకట రమణ చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

నిబంధనలు పాటించాలి

గూడూరు, జనవరి 28 : రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని గూడూరు సర్కిల్ సీఐ సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు మత్తు పదార్థాలు తాగి వాహనాలను నడుపొద్దని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరిధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

మరిపెడ : మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలను అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మంగళవారం సందర్శించారు. పాఠశాలలో మౌళిక వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థులకు అందజేస్తున్న భోజన మెనూనూ పరిశీలించారు.

15 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 28 : అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రమేశ్‌బాబు కథనం ప్రకారం... మంగళవారం మండలకేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తుతెలియని వాహనాన్ని తనిఖీ చేస్తుండగా, డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో 30 బస్తాల్లో 15క్వింటాళ్ల నల్లబెల్లం, పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.లక్షా60 వేలు ఉంటుదని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

రూ. 2.33 లక్షల అపహరణ

నర్సింహులపేట, జనవరి 28 : మండలంలోని ఫకీరతండా జీపీ పరిధిలోని పత్నితండాలో ఓ ఇంట్లో పట్టపగలో చోరీ జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ రామారావు, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న రూ.2లక్షల 33వేలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

నర్సింహులపేట, జనవరి 28 : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సురేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దనాగారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలు ఎక్కడైతే అదుపులో ఉంటాయో.. అక్కడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామ్మోహన్‌రావు, హెచ్‌ఎం జానకీసుమన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

దంతాలపల్లి, జనవరి 28: ద్విచక్రవాహనదారులు బాధ్యతగా హెల్మెట్ ధరించాలని ఎస్సై రాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో హెల్మెట్ ధరించి బైక్‌పై వెళ్తున్న వాహనదారులను ఆపి గులాబీ పువ్వు, చాక్లెట్ ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నర్సయ్య, చెన్నయ్య, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

కేసముద్రం మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్నారాణి

ప్రసన్నారాణి

కేసముద్రం, జనవరి 28 : నూతనంగా ఏర్పాటైన కేసముద్రం మున్సిపాలిటీ కమిషనర్‌గా ప్రసన్నారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ మున్సిపల్ ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసన్నారాణికి కేసముద్రం మున్సిపాలిటీ కమిషనర్‌గా పూర్తి, అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. మంగళవారం ఆమె కేసముద్రం స్టేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆమెను సన్మానించారు. కేసముద్రం ప్రత్యేక అధికారిగా వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సాహిద్ మసూద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

చికిత్స పొందుతూ మృతి

సుగుణ (ఫైల్)

కేసముద్రం, జనవరి 28: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన వాంకుడోత్ రఘుకు గూడూరు మండలం మంగళివారిపేటకు చెందిన సుగుణతో (30) కొన్నేండ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుగుణ కూలి పనులు పని చేస్తుండగా, రఘు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సుగుణపై అనుమానం పెంచుకున్న రఘు తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో 25న మధ్యాహ్నం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆవేశానికి లోనైన రఘు సుగుణ తలపై కర్రతో కొట్టి కత్తితో పొడిచాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన సుగుణను స్థానికులు చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి హత్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, రఘు పరారీలో ఉన్నట్లు తెలిపాడు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

గూడూరు, జనవరి 28 : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు బానోత్ రవికుమార్‌ను బీఆర్‌ఎస్ మండల నాయకులు మంగళవారం పరామర్శించారు. రవికుమార్ తండ్రి బిచ్యానాయక్ (86) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో దవాఖానలో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రేగడితండాకు తీసుకరాగా, మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ ఎండీ కాసీం, నాయకులు నూకల సురేందర్, చీదురు వెంకన్న, సంపంగి రాములు, ఎడ్ల రమేశ్, దేవేంద్రాచారి, సురేశ్, నాగరాజు రవికుమార్‌ను పరామర్శించారు.

వాహనాల బహిరంగ వేలం

ప్రభుత్వానికి రూ.22,47,020 ఆదాయం

తొర్రూరు, జనవరి 28 : తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు మంగళవారం తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు ఏఈఎస్ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్ తెలిపారు. 57 వాహనాలను వేలంలో ఉంచగా, 53 వాహనాలు ఆర్టీవో నిర్ణయించిన ధరకన్నా ఎక్కువ ధరకు విక్రయించినట్లు చెప్పారు. దీనిద్వారా ప్రభుత్వానికి రూ. 22,47,020 ఆదాయం సమకూరిందన్నారు. తొర్రూరు, మరిపెడ, చిన్నవంగర, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు సంబంధించిన వాహనాలను వేలం వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఈవో కిరణ్, ఎక్సైజ్ ఎస్ఐలు రవలిరెడ్డి, ఎన్ శంకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సత్యప్రసాద్, ప్రభాకర్, హరీశ్ పాల్గొన్నారు.

గార్ల తహసీల్దార్ సస్పెండ్

గార్ల : గార్ల మండల తహసీల్దార్ రవీందర్ విధుల్లో నిర్లక్ష్యం.. సమావేశాలకు హాజరుకావడనే కారణంతో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణికి గార్ల మండలం తహసీల్దార్‌గా బాధ్యతలను అప్పగించారు.

స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్

బాధ్యతలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

తొర్రూరు, జనవరి 28 : మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్లుగా అధికారులను ప్రభుత్వం నియమించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టోప్పో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపాలిటీలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ కట్టాస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, జూనియర్ అసిస్టెంట్ శ్రవణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి గ్రామ సభలు

మరిపెడ : ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 మధ్య కాలంలో చేపట్టిన ఉపాధి పనులపై మంగళవారం అబ్బాయిపాలెం, ఉగ్గంపల్లి, గుండెపుడి, తానంచర్ల, గుర్రప్పతండా, దంటకుంటతండా, అనేపురం, తాళ్లకల్, బురికితండా, బాల్యతండాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు.

ఉద్యోగ ప్రకటనను నమ్మి మోసపోయిన యువకుడు

నెల్లికుదురు, జనవరి 28 : ఆన్‌లైన్ యాప్‌లో ఉద్యోగ ప్రకటనను చూసి ఒకరు మోసపోయిన ఘటన మండలంలోని మేచరాజుపల్లిలో మంగళవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. మేచరాజుపల్లికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ యాప్‌లో ఉద్యోగ ప్రకటనను సంస్థను సంప్రదించాడు. ఉద్యోగం కోసం దశలవారీగా రూ.2.50లక్షల నగదును సంస్థ బ్యాంకు ఖాతాకు పంపాడు. కొన్ని రోజుల తర్వాత ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉచిత విద్యను అందించాలి

మహబూబాబాద్ రూరల్ : దేశంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గౌతమ్, నందీశ్వర్, తరుణ్, ప్రవీణ్, రవీందర్ పాల్గొన్నారు.

మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌కు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. మిర్చి కొనుగోళ్ల సమయంలో రైతులకు ఇచ్చే చెక్కుల్లో కమీషన్ తీసుకోవద్దన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు మార్కెట్‌కు వచ్చే రైతులకు విశ్రాంతి భవనం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాకూబ్‌రెడ్డి, సునీల్, రమేశ్, వెంకన్న, సుందర్, సోములు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : విజ్ఞానవంతమైన సమాజం కోసం గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో విజ్ఞానం అందించే పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాలన్నారు. 2024-25 సంవత్సర ఖర్చు చేసిన నిధులు, 2025-26 బడ్జెట్ అంచనాల ఆమోదంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శ్రీలత పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అన్నారు. మంగళవారం ఆయన ఉద్యోగులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానం వల్ల నూతనంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, స్వరూపారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్

మహబూబాబాద్ రూరల్ : మున్సిపల్ పాలక వర్గం గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మానుకోట మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోను నియమించగా, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్, టీపీఏ, టీపీఎస్, సిబ్బంది ఆయన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : యువత టెక్నికల్ స్కిల్స్‌ను పెంచుకోవడం ద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ దేశీరామ్‌నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. 25 ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, 22 కంపెనీలు యువతకు జాబ్ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 910మంది గిరిజన యువత హాజరుకాగా, మెడ్‌ప్లస్, అపోలో, విన్ మోటర్స్, టీ టెక్సాలజీస్, బయోప్లాంట్, మ్యాన్ ఫ్యాక్చరింగ్, సాయి డెలవపర్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు 396 మంది ఎంపికైనట్లు తెలిపారు. రూ.15వేల నుంచి రూ.35వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, సురేశ్ బాబు, కిశోర్, శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్ అన్నారు. మంగళవారం పట్టణంలో జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పరీక్షలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29న మానవతా నైతిక విలువలు, 30న పర్యావరణ విద్య, 31న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, ఫిబ్రవరి ఒకటిన రెండో సంవత్సర విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయని, ప్రతి కళాశాలలో సీసీ కెమెరాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

మూడు నెలలు జీతాలు చెల్లించాలి

డోర్నకల్, జనవరి 28 : ఉపాధి పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ పార్థసారథి కోరారు. మంగళవారం ఆయన డోర్నకల్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిధుల కొరత, సాఫ్ట్‌వేర్ సమస్యలు, ఇతర కారణాలు చెప్పి ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సకాలంలో జీతాలు రాక మానసిక వేదనతో నలుగురు ఉద్యోగులు గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు.

క్రమశిక్షణను పెంపొందించుకోవాలి

కేసముద్రం : విద్యార్థులు క్రమశిక్షణను పెంపొందించుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లక్ష్యం లేని చదువు, క్రమశిక్షణ లేని జీవితం వ్యర్థమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజ్, ట్రైనీ ఎస్సై కోటేశ్వరరావు, హెచ్‌ఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయాలి

కొత్తగూడ, జనవరి 28 : ఫిబ్రవరి 5న సూర్యాపేట పట్టణంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విలీన సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం కోరారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ..సుదీర్ఘ కాలంపాటు కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అరుణోద సంస్థ సాయుధ పోరాటం చేయడం జరిగిందన్నారు.

కేసముద్రంలో తమిళ నాడు వాసి మృతి

కేసముద్రం : తమిళనాడు రాష్ట్రం సేలానికి చెందిన రామచంద్రన్ దుర్గైస్వామి (51) రైల్వే స్టేషన్‌లో మృతి చెందినట్లు రైల్వే పోలీస్ మోహినొద్దీన్ మంగళవారం తెలిపారు. కేసముద్రంలోని రైల్వే స్టేషన్‌లోని ఫ్లాట్ ఫాం-1పై ఉన్న కుర్చీలో పడుకొని సహజంగా మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. అతడి ఆధార్ కార్డు ఆధారంగా దుర్గైస్వామిగా గుర్తించి బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజు

నెల్లికుదురు : డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్ బుదారపు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా హరిసింగ్, పుష్పనీల, ప్రధాన కార్యదర్శిగా ఎం సుధాకర్, కార్యదర్శులుగా కే రామస్వామి, దేవేందర్, సవిత, జిల్లా కౌన్సిలర్లుగా యాదగిరి, డీ.రాజశేఖర్,ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బీ.వినయ్‌కుమార్, సభ్యులుగా అమర్, వెన్నెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.